## క్లుప్తంగా

### ప్రజల దాహార్తి తీర్చడం హర్షణీయం

**పావగడ:** స్థానిక రామకృష్ణసేవాశ్రమం అధిపతి జపానంద స్వామిజీ ప్రజల దాహార్తి తీరుస్తుండటం ప్రశంసనీయమని స్థానిక స్వామి వివేకానంద భక్తుల సమితి ఒక ప్రకటనలో తెలిపింది. అయితే తాగునీరు అందివ్వలేదని స్వామిజీపై కొందరు చేసిన ఆరోపణలు అర్థరహితమని ఖండించారు. స్థానిక అగ్నిమాపక కేంద్రం, కళాశాల మైదానం, మున్సిపల్ బస్టాండు, శనిమహాత్మ సర్కిల్, పోలీస్ స్టేషన్, పోలీస్ వసతి సముదాయం, ప్రజాస్పత్రి, వాల్మీకి నగర్, మాధ్యమిక పాఠశాల ప్రాంతాలలో ఏర్పాటైన ఆర్వో ప్లాంట్లు నిరంతరం ప్రజలకు తాగునీరు అందిస్తున్నాయన్నారు. అయితే తాలూకా కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు వేరే చోటుకు బదిలీ చేస్తున్న నేపథ్యంలో ఆ ప్లాంటులో నీరు నింపడం లేదన్నారు.

### రోటరీ ఆధ్వర్యంలో రక్తదానం


రక్తదానం చేస్తున్న దృశ్యం

**హిందూపురం టౌన్:** చార్టెడ్ అకౌంట్ డేను పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చార్టెడ్ అకౌంటెంట్ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరాన్ని రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగరాజురెడ్డి, ఆడిటర్స్ ప్రారంభించారు. మొబైల్ వాహనం ద్వారా దాదాపుగా 50 యూనిట్ల రక్తం సేకరించారు. చార్టెడ్ అకౌంట్ డేను పురస్కరించుకుని ప్రతి యేటా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడినవారమవుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏటీపీ బ్రాంచ్ ఆఫ్ సర్ మెంబర్స్ వరదరాజు, రోటరీ క్లబ్ కార్యదర్శి శ్రీనివాసులు, సభ్యులు, ఆడిటర్లు పాల్గొన్నారు.

### పింఛన్ల పంపిణీలో కోత


పెద్దవెంకటరెడ్డి

**రొద్దం:** మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో పెద్ద వెంకటరెడ్డి అనే వ్యక్తికి వృద్ధాప్య పింఛన్ రూ.7 వేలు ఇవ్వాల్సి ఉంది. అయితే రూ.200 కోత విధించి కేవలం రూ.6,800 మాత్రమే పింఛన్ అందజేసినట్లు పెద్ద వెంకటరెడ్డి కుమారుడు రామిరెడ్డి ఆరోపించారు. ఈ విషయంపై ఉన్నతాధికాలకు ఫిర్యాదు చేయడంతో సాయంత్రం తహసీల్దార్ లక్ష్మీనారాయణ విచారణ చేశారన్నారు. విచారణ అనంతరం లబ్ధిదారుడికి మళ్లీ రూ.200 అందజేసినట్లు తెలిపారు. మరోవైపు నారనాగేపల్లిలో వైఎస్సార్‌సీపీ మద్దదారులకు పింఛన్లు పంపిణీ చేయకుండా నిలిపినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఎంపీడీఓను వివరణ కోరగా ఈ విషయంపై తనకు లబ్ధిదారుడు కమ్మర క్రిష్టప్ప ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

### జంగాలపల్లిలో ఘర్షణ

**పరిగి:** కొత్త న్యాయ చట్టాల ప్రకారం పరిగి మండలంలో తొలి ఎఫ్ఐఆర్‌ను పోలీసులు నమోదు చేశారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలమేరకు.. మండలంలోని హొన్నంపల్లి పంచాయతీ పరిధిలోని జంగాలపల్లిలో సోమవారం గ్రామానికి చెందిన బాలాజీ.. వరుసకు సోదరులయ్యే అంజినప్ప, నరసింహప్ప, తిప్పన్నతో కొంతకాలంగా భూ వివాదం నెలకొంది. ఆస్తి గొడవల కారణంగా సోమవారం ఉదయం బాలాజీపై అంజినప్ప, నరసింహప్ప, తిప్పన్న కర్రతో దాడి చేసి గాయపరిచారు. దీంతో బాధితుడు బాలాజీ పరిగి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. అతని ఫిర్యాదు మేరకు ముగ్గురిపై భారతీయ న్యాయ చట్టంలో భాగంగా క్రిమినల్ కేసు బీఎన్ఎస్ సెక్షన్ ప్రకారం 118 (324 పాత ఐపీసీ సెక్షన్) కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### 'అతిసారం' కు చెక్ పెడదాం


గోరంట్ల: అతిసార వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

**పరిగి:** డయేరియా (అతిసార) వ్యాధి ప్రభావం చిన్నారుల్లో ఎక్కువగా ఉంటుందని, ఒక్కోసారి ప్రాణాప్రాయం సంభవిస్తుందని ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ నవీన, డాక్టర్ స్వరూపరెడ్డి తెలిపారు. మండలంలోని కొడిగెనహళ్లి ఏపీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆశ్రమ పాఠశాలలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల ఆధ్వర్యంలో అతిసారా మాసోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

**గోరంట్ల:** పట్టణంలోని రెడ్డివారి వీధిలో సోమవారం డాక్టర్ వాసు ఆధ్వర్యంలో వైద్యాబృందం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ జబ్బులతో బాధపతుతున్న రోగులను డాక్టర్ల బృందం పరిశీలించి మందులు అందజేశారు. అనంతరం రెడ్డివారివీధిలో ఇంటింటికీ వెళ్లి అతిసార వ్యాధిపై అవగాహన కల్పించారు.

# చదువు .. బరువు


హిందూపురంలోని న్యూహస్నాబాద్ స్కూల్

- చిన్నారులతో నోటు పుస్తకాలు మోయించిన పాఠశాల సిబ్బంది
- పట్టించుకోని టీచర్లు, ఆయాలు

**హిందూపురం:** పట్టణంలోని న్యూహస్నాబాద్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం నోటు పుస్తకాలు మంజూరు చేసింది. ఇందులో భాగంగానే సోమవారం నోటు బుక్కుల బండిళ్లను ఆటోలో తీసుకొచ్చారు. అయితే పాఠశాల సిబ్బంది విద్యార్థుల చేత బరువైన నోటు పుస్తకాల బండిళ్లను మోయించారు. టీచర్లు, పనిచేసే ఆయాలు చూస్తుండి పోయారే తప్ప ఒక్కరు కూడా ఒక నోటు పుస్తకాన్ని కూడా మోయలేదు. పిల్లలతో ఇలాంటి పనులు చేయించడం సరికాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డుపై ఉన్న ఆటోలో నుంచి నోటు పుస్తకాల బండిళ్లు మోసుకెళ్తున్న చిన్నారులు

### ఆర్టీసీ బస్సులు నడపాలని వినతి


ఆర్టీసీ అధికారి హంపన్నకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**హిందూపురం టౌన్:** లేపాక్షి మండలం గోపిందేవరపల్లి, శిరివరం, పులమతి, సడ్లపల్లి గ్రామాల నుంచి పట్టణంలో విద్యను అభ్యసించడానికి 50 మందికి పైగా విద్యార్థులు వస్తుంటారు. వారికి అనుగుణంగా ఆర్టీసీ బడి బస్సులు నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ బస్టాండ్‌లో అధికారి హంపన్నకు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావాలి మాట్లాడుతూ గోపిందేవరపల్లి, శిరివరం గ్రామాల నుంచి విద్యార్థులు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి గతంలో నడిపిన ఆర్టీసీ బడి బస్సులను తిరిగి ఆ ప్రాంతాలకు నడిపి విద్యార్థుల పాఠశాల, కళాశాల సమయానికి రావడానికి, వెళ్లడానికి సమస్యలు లేకుండా చూడాలన్నారు. నాయకులు లిఖిత్, సురేష్, విక్రమ్, విశ్వాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

### శిక్షణ తరగతులను విజయవంతం చేయండి


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

**పెనుకొండ:** ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 8, 9, 10 తేదీల్లో కాకినాడలో రాష్ట్రస్థాయి సదస్సు జరగనుందన్నారు. విద్యార్థులు ఈ తరగతుల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను విడుదల చేసారు.

### చిలమత్తూరులో మోస్తరు వర్షం

**చిలమత్తూరు:** మండలంలో ఆదివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. కొద్ది రోజులుగా వర్షం లేకపోగా విత్తనాలు వేసుకునేందుకు చాలా మంది రైతులు వర్షం కోసం ఎదురు చూశారు. వర్షం కురవడంతో విత్తనాలు వేసుకునేందుకు సిద్ధం అయ్యారు. కాగా సోమవారం సాయంత్రం కూడా మోస్తరు వర్షం కురిసింది. రోజంతా ఆకాశం మేఘావృతమై ఉండగా ఉష్ణోగ్రతలు అత్యల్పంగా నమోదయ్యాయి.

### డెంగీ నివారణపై అవగాహన


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సబ్ యూనిట్ అధికారి సమీవుల్లా

**అగళి:** మండల పరిధిలోని హళ్లికెర పంచాయతీలో సబ్ యూనిట్ అధికారి సమీవుల్లా ఆధ్వర్యంలో డెంగీ, మలేరియాపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సబ్ యూనిట్ అధికారి సమీవుల్లా వివరించారు.

### ఆరోపణలు అర్థరహితం

**పావగడ:** రొప్ప గ్రామ పంచాయతీ పీడీఓ విజయ్‌కుమార్‌పై బొమ్మతనహళ్లి పంచాయతీ సభ్యుడు జీఎన్ హనుమంతరాయప్ప చేసిన ఆరోపణలు అర్థ రహితమని రొప్ప గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు రూప నాగరాజు తెలిపారు. సోమవారం పంచాయతీ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చడానికి అత్యవసర పరిస్థితుల్లో సీఈఓ ఆదేశాలతో పీడీఓ పంచాయతీ నిధులను ఖర్చు చేయడం ఎలా అవినీతి అవుతుందో చెప్పాలన్నారు. హనుమంతరాయప్ప బెదిరింపులతో రొప్పలో పనిచేయడానికి పీడీఓలు భయపడుతున్నారన్నారు. మాజీ అధ్యక్షుడు రామాంజినప్ప , ఉపాధ్యక్షుడు శంకరనాయక్, సభ్యులు వెంకటేశ్‌మూర్తి, నాగమణి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సాఫీగా పింఛన్ల పంపిణీ


హిందూపురంలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర


రొద్దంలో సామాజిక పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత

**రొళ్ల:** మండల పరిధిలోని ఎం.రాయాపురం ఎస్సీ కాలనీలో సోమవారం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, కలెక్టర్ అరుణ్‌బాబు స్థానిక నాయకులతో కలిసి పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఇందులో భాగంగానే ఎన్టీఆర్ భరోసా కింద సామాజిక పింఛన్ నగదును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్, మాజీ ఎమ్మెల్సీ గుండుమాల తిప్పేస్వామి, మండల స్పెషల్ ఆఫీసర్ సోని తదితరులు పాల్గొన్నారు.

**రొద్దం:** మండల వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ సాఫీగా సాగింది. సోమవారం ఉదయం నుంచి సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. బీసీ సంక్షేమశాఖా మంత్రి సవితమ్మ కె.మరువపల్లి, పి.రొప్పాల రొద్దం గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీ బీకే పార్థసారథి రెడ్డిపల్లి, దొడగట్ట, ఆర్ మరువపల్లి గ్రామాలలో పింఛన్లు అందించారు.

**మడకశిరరూరల్:** మండలంలోని ఆమిదాలగొంది, మరువపల్లి, చందకచెర్లు, గౌడనహళ్ళి, గోవిందాపురం,నీలకంఠాపురం గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు లబ్ధిదారులకు సామాజిక పింఛన్ నగదును పంపిణీ చేశారు.

**మడకశిర:** పట్టణంలోని వివిధ వార్డు సచివాలయాల పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రారంభించారు.

**పరిగి:** రాష్ట్రంలో ప్రతి పేదవాడికి లబ్ధి చేయడమే తమ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి, అణగారిన వర్గాల సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. సోమవారం మండలంలోని ఊటుకూరు, పైడేటి గ్రామ పంచాయతీ పరిధిలో పింఛన్‌దారులకు నగదు పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు అందజేశారు.

**అమరాపురం:** మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ సాఫీగా జరిగింది. సోమవారం ఉదయమే సచివాలయ అధికారులు, టీడీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ గణేష్, నాయకులు క్రిష్ణమూర్తి, సిద్దేశ్వర, కాంతప్ప, జయకుమార్, జయరామప్ప పాల్గొన్నారు.

**పెనుకొండ:** పెనుకొండ మున్సిపల్ పరిధిలోని వివిధ గ్రామాల్లో సోమవారం పింఛన్ల పంపిణీ సజావుగా జరిగింది. ఉదయమే సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు.

**హిందూపురం:** మండల పరిధిలోని కొట్నూరులో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, తహసీల్దార్ శివప్రసాద్ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. హిందూపురం మున్సిపాల్టీలో పరిధిలో మొదటిరోజు పింఛన్‌దారులకు 12,406 మందికి 90.98 శాతం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర నియోజకవర్గంలో చిలమత్తూరు మండలంలోని దేమకేతేపల్లి, లేపాక్షి మండలం చోళసముద్రం, హిందూపురంలో పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**లేపాక్షి:** మండల వ్యాప్తంగా సోమవారం సామాజిక పింఛన్లు 75 శాతం పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 6,922 లబ్ధిదారులు ఉండగా అయితే వీరందరికి రూ.4.74 కోట్లు పంపిణీ చేయాల్సి ఉందని ఎంపీడీఓ వాసుదేవగుప్తా తెలిపారు. సోమవారం సాయంత్రం సమయానికి 75 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశామన్నారు.

**సోమందేపల్లి:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన సోమందేపల్లిలోని స్నేహలతనగర్‌లో ఏర్పాటు చేసిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, తహసీల్దార్ అంజనాదేవి తదితరులు పాల్గొన్నారు.

# యువకుడి ఆత్మహత్య


జయప్రకాశ్‌రెడ్డి (ఫైల్)

**పుట్టపర్తి:** బుక్కపట్నం మండలం తరుగువాండ్లపల్లికి చెందిన ప్రభాకర్‌రెడ్డి కుమారుడు జయప్రకాశ్‌రెడ్డి (24) ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. జయప్రకాశ్‌రెడ్డి డిగ్రీ చదువుకున్నాడు. ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నా సరైనది దొరకలేదు. మరోవైపు తండ్రి సాగు చేసిన టమాట పంటకు వైరస్ సోకింది. మార్కెట్లో మంచి ధర ఉన్నప్పటికీ పంట వైరస్ కారణంగా దెబ్బతింది. మనస్తాపానికి గురైన జయప్రకాశ్‌రెడ్డి ఆదివారం రాత్రి పొలంలోకి వెళ్లి చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. చేతికొచ్చిన కొడుకు ఇలా అర్ధంతరంగా తనువుచాలించడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోదరుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరెడ్డి, పార్టీ యువనేత కొత్తకోట చక్రధర్‌రెడ్డి, సర్పంచ్ రమణయ్య, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ భర్త గోవర్ధన్‌రెడ్డి, సిద్ధరాంపురం వెంకటరెడ్డి, రిటైర్డు ఉపాధ్యాయుడు చెన్నకృష్ణారెడ్డి, పార్టీ బూత్ లెవల్ మేనేజర్ పతంజలి తదితరులు సోమవారం గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

### కాటికోటేశ్వరునికి ప్రత్యేక పూజలు


పూజలందుకున్న కాటికోటేశ్వరుడు

**బత్తలపల్లి:** సంజీవపురం సమీపంలోని కాటమయ్యకొండలో వెలసిన కాటికోటేశ్వరునికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ఆభరణాలు, పూలతో అందంగా ముస్తాబు చేశారు. ఆకుపూజ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### పింఛన్ల పంపిణీలో గందరగోళం

**గోరంట్ల:** మండల వ్యాప్తంగా సోమవారం ప్రభుత్వ అధికారులు సామాజిక భద్రత పింఛన్లలో గందరగోళం ఏర్పడింది. 50 మంది లబ్ధిదారులు ఒక్కో అధికారి పింఛన్ పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే పింఛన్ పంపిణీ చేసే అధికారికి గ్రామాన్ని యూనిట్ కింద లబ్ధిదారులను కేటాయించకుండా వివిధ గ్రామలకు చెందిన లబ్ధిదారులను కేటాయించారు. దీంతో అయా గ్రామలకు వెళ్లిన అధికారుల పంపిణీ జాబితాలో లబ్ధిదారుల పేర్లు కనబడక ఇబ్బందులు ఎదురయ్యారు. దీనికితోడు సర్వర్లు సరిగా పనిచేయకపోవడంతో లబ్ధిదారులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా మండల పరిధిలోని పాలసముద్రం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమాన్ని మంత్రి సవిత ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### హుండీ కానుకల లెక్కింపు

**నల్లచెరువు:** మండలంలో ప్రసిద్ధిగాంచిన పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలోని హుండీ కానుకలను అధికారులు సోమవారం లెక్కించారు. 2023 సెప్టెంబరు నుంచి 2024 జూలై వరకు హుండీ ఆదాయం రూ.4,78,663 వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బి నరసింహరాజు, ఈఓ రవీంద్ర రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన చట్టాలపై అవగాహన


గుడిబండ: అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ బాజిజాన్ సైదా


లేపాక్షిలో మాట్లాడుతున్న ఎస్ఐ గోపీ


పరిగి: నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

**గుడిబండ:** మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, డ్రైవర్లు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుకొండ డీఎస్పీ బాజిజాన్ సైదా, సీఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఐపీసీ, సీఆర్పీసీ, ఐఈఏ సెక్షన్లకు బదులు ప్రస్తుతం భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య సంహిత వంటి కొత్త చట్టాలను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఇప్పటికే ఆ చట్టాలు అమల్లోకి వచ్చాయని, వాటిపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మునిప్రతాప్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**పరిగి:** నూతన చట్టాలపై ఎస్ఐ సత్యనారాయణ సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన చట్టాలను వివరించారు. ప్రజారక్షణలో పోలీసులదే కీలక పాత్ర అని తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

**అగళి:** మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కొత్త చట్టాల పై విద్యార్థులకు, ఉపాధ్యాయుల, డ్రైవర్లు, గ్రామ పెద్దలతో ఎస్ఐ వీరేష్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ వీరేష్ మాట్లాడుతూ.. కొత్త చట్టాలు సోమవారం నుంచి అమలు అవుతాయని, అలాగే కొత్త చట్టాల మేరకు కేసు నమోదు, విచారణ, సాక్షి సేకరణ చేస్తామన్నారు. ఈ మేరకే కోర్టులో విచారణ జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ వీరేష్ సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బషీర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**పెనుకొండ:** ప్రజలు నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ రాజేష్ పేర్కొన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం నూతన చట్టాలపై ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. అనంతరం చట్టాలకు సంబంధించిన ఫ్లెక్సీని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆవిష్కరించారు.

**రొళ్ల:** స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం మధ్యాహ్నం ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రజలకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ పోలీస్‌శాఖలో గతంలో సీఆర్పీసీ, ఐపీసీ సెక్షన్లకు బదులుగా ప్రస్తుతం కొత్తగా బీఎన్ఎస్ (భారతీయ న్యాయ సంహిత), బీఎన్ఎస్ఎస్ (భారతీయ నాగరిక సురక్ష సంహిత), బీఎస్ఏ (భారతీయ సాక్ష్య సంహిత) సెక్షన్లకు సంబంధించిన కొత్త చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. కొత్తగా అమల్లోకి వచ్చిన చట్టాల పై ప్రతి ఒక్కరు కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. చట్టాలను ఎవరైన అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జమేదార్ రామలింగయ్య, కానిస్టేబుల్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

**లేపాక్షి:** స్థానిక లేపాక్షి పోలీసుస్టేషన్‌లో సోమవారం ఉదయం నూతన చట్టాలపై ఎస్ఐ గోపీ ప్రజలకు అవగాహన కల్పించారు. పాత చట్టాల గురించి వివరిస్తూనే నూతన చట్టంలో వచ్చే మార్పులకు అనుగుణంగా ప్రజలు ప్రవర్తించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పోలీసులు పాల్గొన్నారు.

**అమరాపురం:** స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భారత ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన చట్టాలపై ఎస్ఐ.జనార్ధన నాయుడు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. నూతన చట్టాలపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ.రామంజనేయులు, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.


అమరాపురం: మాట్లాడుతున్న ఎస్ఐ.జనార్ధననాయుడు

### పేదలకు ఇళ్లు మంజూరు చేయాలి


మున్సిపల్ ఆఫీసు వద్ద ఆందోళన చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

**హిందూపురం:** ఇళ్లులేని నిరుపేదలకు అధికారంలో రాగానే ఇంటి పట్టాలు పట్టాలతో ఇల్లు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు టీడీపీ ప్రభుత్వం పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పేదల ఇంటిస్థలాల పోరాట కమిటీ కోకన్వీనర్ జ్యోతమ్మ అధ్యక్షతన సోమవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ చాంబర్ వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలోని కొట్నూరు వద్ద గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇంటిపట్టాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన విధంగా ఇల్లు లేని నిరుపేదలకు ప్రతి ఒక్కరికీ 2 సెంట్లు స్థలాన్ని కేటాయించి ఇళ్లు కట్టించివ్వాలన్నారు. రాజకీయ వివక్ష లేకుండా పేదలకు న్యాయం చేయాలన్నారు. నివాస ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, కార్యదర్శి పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.